సాక్షి జగిత్యాల

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



స్వాతి నక్షత్రం పూజలు

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీఉగ్రనృసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు వంశీ స్వామివారికి పూజలు జరిపించారు.



ఘొల్లుమన్న గోపాల్‌రావుపల్లె

పోరుబాట పట్టిన ఊరిబిడ్డ అమరుడయ్యాడని గోపాల్‌రావుపల్లె ఘొల్లుమంది. నమ్మిన బాటలోనే ప్రాణాలు విడిచాడని ఊరు, వాడ కన్నీటిపర్యంతమైంది. 10లో▸



వాతావరణం

భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

శాకంబరిగా అమ్మవారు



శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శాకంబరి రూపంలో అమ్మవారు

ధర్మపురి: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాత్యాయనిగా అమ్మవారి దర్శనం



కాత్యాయని రూపంలో అమ్మవారు

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిచ్చారు. స్థానాచార్యులు కపీందర్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి, అర్చకులు అఖిల్ కృష్ణ అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

ఎస్సారెస్పీకి 3.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వరద నీటితో నిండిన ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 3.05 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరి లోకి వదులుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ, జువ్వాడి

మల్లాపూర్ : ముత్యంపేటలోని చక్కెర కర్మాగారం వద్ద పరిశ్రమలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ కు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు పరిశీలించారు. షుగర్ ఫ్యాక్టరీలను పునఃప్రారంభించే క్రమంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అధికారుల బృందం రానుందని, పార్టీలకు అతీతంగా రైతులు పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాలని సూచించారు. వారి వెంట కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. తప్పని అవస్థ



ఇది జిల్లాకేంద్రంలోని చిలుకవాడ సమీపంలోని సీసీరోడ్డు. ఇటీవల డ్రైనేజీలోంచి సిల్ట్ తీసి రోడ్డుపైనే పడేశారు. వర్షానికి బురదగా మారి దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిల్ట్ రోడ్డుపై పడేయడంతో వరదకు రోడ్డుపై కొట్టుకొచ్చి నడవడానికే ఇబ్బందిగా మారింది.



ఇది సాయిబాబా గుడి ముందు గల డ్రైనేజీ. సిల్ట్ సరిగా తీయకపోవడంతో వర్షం పడినంతసేపు మురికినీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో పాదచారులు, వాహనదారులు అటువైపు రావాలంటేనే భయపడుతున్నారు. సమీపంలోని దుకాణదారులు దుర్వాసన తట్టుకోలేకపోతున్నారు. డ్రైనేజీలోని మురికినీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఇది పార్క్ గల్లీలోని ప్రధాన రోడ్డు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు చెడిపోయి దాదాపు ఏడాదికిపైనే అవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటున్నారు స్థానికులు. వర్షానికి వాగులా ఉప్పొంగుతోంది.

- రోజంతా వర్షం..
- రోడ్లన్నీ బురదమయం
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని విద్యానగర్ ప్రధాన రోడ్డు. వర్షం కురవడంతో పూర్తిగా బురదమయమైంది. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి ముప్పారపు ట్యాంక్‌కు వెళ్తుంటారు. బతుకమ్మ పండుగకు కనీసం మొరం పోయకపోవడంతో పూర్తిగా బురదమయంగా మారింది. అధికారులు స్పందించి బతుకమ్మ ఆడుకునే మహిళల కోసం మొరం పోయాలని మహిళలు కోరుతున్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఉదయం నుంచే వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఉద్యోగులు, మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పండుగకావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లాకేంద్రానికి వస్తుంటారు. రోడ్లన్నీ బురదమయంగా మారడంతో నానా ఇబ్బందులకు గురయ్యారు. సద్దుల బతుకమ్మ సమీపించినా.. మున్సిపల్ అధికారులు ఎక్కడా మొరం పోయించలేదు. కనీసం మహిళలు ఆడుకోవడానికీ ఇబ్బందిగా మారింది. రోడ్లు బాగా లేక.. బురదమయం కావడంతో వాహనదారులు, ప్రజలు నడవడానికే అవస్థలు పడ్డారు. సద్దుల పండుగ సందర్భంగా రోడ్ల మరమ్మతు, ఘాట్ల వద్ద ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించినా.. ఇప్పటివరకు పనులు ముందుకుసాగడం లేదు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

జిల్లా కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలోని పూడికతీత తీయకపోవడం.. తీసినా రోడ్లపైనే ఉంచడం.. వర్షానికి అంతా రోడ్డుపైకి కొట్టుకొచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల నిండి మురికినీరు బయటకు వెళ్లడంలేదు. వర్షానికి డ్రైనేజీలన్నీ నిండి రోడ్లపైనే మురికినీరు ప్రవహిస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'స్థానికం'పై ముందడుగు

- పీవో, ఏపీవోల నియామకం
- నేడు అధికారులకు శిక్షణ

జగిత్యాల: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఈ మేరకు పీవో, ఏపీవోలను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం ఐదు టీంలలో కలిపి 2464 మంది పీవో, ఏపీవోలను నియమించారు. వీరికి క్లస్టర్ల వారీగా శిక్షణ ప్రారంభం కానుంది.

గ్రీన్ సిగ్నల్ రాగానే..

స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమైంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు కసరత్తు చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వార్డు మెంబర్ల రిజర్వేషన్లను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో ఐదు టీంలను నియమించి ఎన్నికలపై శిక్షణ కల్పించనున్నారు. జిల్లాలో 20 జెడ్పీటీసీలు, 216 ఎంపీటీసీలు, 3,536 వార్డులు ఉండగా.. ఈ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు పీవోలు, ఏపీవోలను నియమించి శిక్షణ ఇస్తారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడం.. పీవో, ఏపీవోలను నియమించి శిక్షణ ఇవ్వనుండటంతో ఆశావహుల్లో హడావుడి నెలకొంది.

శిక్షణ ఇలా..

రాయికల్, మేడిపల్లి, భీమారం, కోరుట్ల, కథలాపూర్ పీవో, ఏపీవోలకు కోరుట్లలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం అధికారులకు మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని విదిత్ రెడ్డి గార్డెన్స్, మల్యాల, గొల్లపల్లి, కొడిమ్యాల, పెగడపల్లి అధికారులకు మల్యాలలోని మహాలక్ష్మీగార్డెన్స్, జగిత్యాలరూరల్, జగిత్యాల, బీర్‌పూర్, సారంగాపూర్ అధికారులకు కలెక్టరేట్‌లో, ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, ఎండపల్లి అధికారులకు ధర్మపురిలోని ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో శిక్షణ ఇవ్వనున్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీనృసింహుడు



కవర్లు కప్పి స్వామివారికి శోభాయాత్ర

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అయితే దేవుడిపై వర్షం కురిస్తే అరిష్టమని, ఈ విషయం తెలిసినా ఆలయ అధికారులు కవర్లు కప్పుకొని ఊరేగించారని పలువురు భక్తులు అనడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో సేవను నిలిపివేశారు. గురువారం సేవను కొనసాగించడంపై విమర్శలు వాచ్చాయి. దీనిపై ఆలయ చైర్మన్ జక్కు రవీందర్‌ను వివరణ కోరగా.. ఊరేగింపు సమయంలో వర్షం రాలేదని, ముందు జాగ్రత్త చర్యగా కవర్లు కప్పుకొని స్వామివారి శోభాయాత్ర చేశామని పేర్కొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించండి.. బహుమతి గెలుచుకోండి

- జగిత్యాల డిపో మేనేజర్ కల్పన



జగిత్యాల డిపో మేనేజర్ కల్పన

జగిత్యాలటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీడ్రాలో బహుమతి గెలుచుకోవాలని జగిత్యాల డిపో మేనేజర్ కల్పన ప్రయాణీకులను కోరారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించిందని, ఈనెల 27నుంచి అక్టోబర్ 6వరకు సెమీ డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి ఏసీ, నాన్ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు లక్కీడ్రాకు అర్హులని తెలిపారు. ప్రయాణికులు తమ బస్ టికెట్ వెనుక పేరు చిరునామా, ఫోన్ నంబర్ వివరాలు రాసి బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. అక్టోబర్ 8న కరీంనగర్ రీజనల్ ఆఫీసులో లక్కీడ్రా ఉంటుందని పేర్కొన్నారు. రీజియన్ నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేసి మీడియా ద్వారా తెలియజేస్తామని వివరించారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు చెక్కు రూపంలో అందిస్తామని తెలిపారు.



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హంస వాహనంపై స్వామివారు

హంస వాహనంపై స్వామివారు

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. హంస వాహనంపై స్వామివారు, గజ వాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులతో పూజలు చేశారు. ఆలయాల చైర్మన్లు ఎతిరాజం నర్సయ్య, బూరుగు రామస్వామిగౌడ్, కార్యనిర్వహణాధికారి విక్రమ్, సహాయాధికారి పి.నర్సయ్య, పూజారులు బీర్నది నరసింహాచారి, ఇందుర్తి మధుసూదనచారి పాల్గొన్నారు.



శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో గజ వాహనంపై శ్రీవారు



జగిత్యాల బస్టాండ్‌లో బతుకమ్మ సంబరాలు



విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



ఎస్పీ కార్యాలయంలో కోలాటం ఆడుతున్న ఎస్పీ

ఘనంగా బతుకమ్మ సంబరాలు

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలో గురువారం బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఆడిపాడారు. డిపో మేనేజర్ కల్పన, సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత పాల్గొన్నారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం, ఎస్ఏవో తిరుపతయ్య, డీఈలు గంగారాం, మధుసూదన్ పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ కోలాటం ఆడారు. పూలను పూజించే సంప్రదాయం ఇక్కడే ఉందన్నారు. డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, ఏవో శశికళ, ఆర్ఐ కిరణ్‌కుమార్, వేణు, సైదులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మద్యం షాపుల టెండర్లకు వేళాయె..

- 71 షాపులకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎస్సీలకు 8, గౌడ కులస్తులకు 14..
- జనరల్‌కు 49 షాపులు కేటాయింపు

జగిత్యాలక్రైం: జిల్లాలోని మూడు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 71 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. అబ్కారీ శాఖ ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో లక్కీడ్రా పద్ధతిలో రిజర్వేషన్ల ద్వారా దుకాణాలు ఎంపిక చేశారు. ఎస్సీలకు 8, గౌడ కులస్తులకు 14, జనరల్‌లో 49 దుకాణాలను రిజర్వేషన్ ప్రకారం కేటాయించారు. అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 23న డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మద్యం షాపులు దక్కించుకున్నవారు 2025 డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 2027 నవంబర్ 30 వరకు నిర్వహించుకోవచ్చు. నోటిఫికేషన్ విడుదల కావడంతో మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు.

71 దుకాణాలకు దరఖాస్తులు

జిల్లాలో నాలుగు సర్కిళ్ల పరిధిలో 71 షాపులకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. జగిత్యాల సర్కిల్ పరిధిలో 28, ధర్మపురి పరిధిలో 18, మెట్‌పల్లి పరిధిలో 25 షాపులకు టెండర్లు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

నాలుగు స్లాబుల్లో దుకాణాల కేటాయింపు

జిల్లాలో నాలుగు స్లాబుల్లో మద్యం లైసెన్స్ ఫీజు ఖరారు చేశారు. 5 వేలకు పైగా జనాభా ఉంటే రూ.50 లక్షల లైసెన్స్ ఫీజుతో 22 దుకాణాలు, 5001 నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షల లైసెన్స్ ఫీజుగలవి 22 షాపులు, 50,001 జనాభా నుంచి లక్షలోపు ఉంటే రూ.60లక్షల ఫీజుతో 15 ఉన్నాయి. లక్ష నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.65 లక్షల ఫీజుతో 12 లైసెన్స్‌డ్ దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

గతంలో 2,636 దరఖాస్తులు

జిల్లాలో 71 మద్యం దుకాణాలకు గతంలో టెండర్లు ఆహ్వానించగా 2,636 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.రెండు లక్షల వరకు ఫీజు నిర్ణయించింది. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.52.72 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలుగా నిర్ణయించింది. గతంలో ఒక్కో దరఖాస్తుదారుడు ఒక దరఖాస్తు మాత్రమే చేసుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం ఒక దరఖాస్తుదారుడు ఎన్ని దరఖాస్తులైనా.. ఎన్ని దుకాణాలకైనా చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది.

రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి



డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తున్న కలెక్టర్

మద్యం దుకాణాలను కలెక్టర్ సత్యప్రసాద్ కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఒక్కో షాపునకు ఫీజు రూ.3 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, బీసీ సంక్షేమాధికారి నరేశ్, ఎస్సీ సంక్షేమాధికారి రాజ్‌కుమార్ సమక్షంలో డ్రా తీశారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



జిల్లాలోని 71 మద్యం షాపులకు శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. రెండేళ్ల కాలపరిమితితో అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంతోపాటు జగిత్యాల సర్కిల్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేశాం.

– ఏనుగుల సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్

సాదాబైనామాలపై స్పెషల్‌డ్రైవ్

- నిష్పక్షపాతంగా విచారణ
- ఒకే గ్రామంలో 15 మంది జీపీవోలు
- రాయికల్ మండలంలో ప్రయోగం



చింతలూరులో సాదాబైనామాలపై విచారణ చేపడుతున్న తహసీల్దార్ నాగార్జున, జీపీవోలు

రాయికల్: సాదాబైనామాల పరిష్కారానికి రాయికల్ తహసీల్దార్ నాగార్జున వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టారు. మండలంలోని ఓ గ్రామాన్ని ఎంచుకుని.. ఆ గ్రామంలో వచ్చిన దరఖాస్తులను విచారణ చేపట్టేందుకు ఏకంగా 15 మంది జీపీవోలను నియమించారు. మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అల్లీపూర్‌లో 441 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఆలూరులో 42, భూపతిపూర్‌లో 248, బోర్నపల్లిలో 80, చింతలూరులో 54, దావన్‌పల్లిలో 56, ధర్మాజీపేటలో 76, ఇటిక్యాలలో 956, కట్కాపూర్‌లో 120, కిష్టంపేటలో 65, కుమ్మరిపల్లిలో 94, మైతాపూర్‌లో 136, మూటపల్లిలో 284, ఒడ్డెలింగాపూర్‌లో 113, రాయికల్ 513, రామాజీపేటలో 102, తాట్లవాయిలో 169, ఉప్పుమడుగులో 27, వస్తాపూర్‌లో 50, వీరాపూర్‌లో 44 చొప్పున మొత్తంగా 3,670 దరఖాస్తులు వచ్చాయి.

ఒకే గ్రామంలో 15 మంది జీపీవోలతో..

2014 జూన్ 2కు ముందు తెల్లకాగితం ద్వారా భూముల కొనుగోలు, అమ్మకాలు చేసుకుని.. 20202 అక్టోబర్ 12 నుంచి 2020 నవంబర్ 10 వరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఏయే గ్రామాల్లో ఎంతమంది సాదాబైనామాలకు దరఖాస్తు చేసుకున్నారో సంబంధిత జీపీవోల నుంచి సమాచారం సేకరించారు. వీటిని నిష్పక్షపాతంగా పరిష్కరించే దిశగా తహసీల్దార్ నాగార్జున ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రతిరోజు ఒక రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసుకుని.. ఆ గ్రామంలో ముందస్తుగా సమాచారం అందించి.. ప్రజలముందే సాదాబైనామాలపై రెవెన్యూ అధికారులతోపాటు, 15 మంది జీపీవోలతో పరిష్కరించేలా చూస్తున్నారు. ఆయా గ్రామాల్లో తేదీలు ప్రకటించి ఆ మేరకు సాదాబైనామాల సమస్యకు చెక్ పెట్టేందుకు ముందుకు కదులుతున్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా ఆ గ్రామానికే రెవెన్యూ అధికారులు, జీపీవోలు వెళ్లి పరిష్కరించడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఒకేసారి 15 మంది జీపీవోలతో



సాదాబైనామా సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తక్కువ సమయంలో పరిష్కరించేందుకు ఒకే గ్రామంలో ఒకేసారి 15 మంది జీపీవోలతో విచారణ చేపడుతున్నాం. సంబంధిత రెవెన్యూ అధికారులే గ్రామానికి వెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తున్నాం. అనుమానం వస్తే ఫీల్డ్ విజిట్ చేస్తున్నాం.

– నాగార్జున, తహసీల్దార్, రాయికల్

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి: గ్రామాల్లో వసతులు కల్పించి.. అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయపట్నం, దోనూర్‌లో రూ.45 లక్షలతో చేపట్టనున్న పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో వంద శాతం అభివృద్ధి చేస్తామన్నారు. రాయపట్నంలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, రూ.5లక్షలతో అంబేడ్కర్ భవనం పనులు, రూ.1.5 లక్షలతో ఎలక్ట్రికల్ లైట్లకు శంకుస్థాపన చేశారు. దోనూర్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, నాయకులు ఎస్.దినేష్, కుంట సుధాకర్ తదితరులున్నారు.

కొలువు కొట్టారు



లక్ష్యానికి కృషి తోడైతే విజయం దరిచేరుతుందనేందుకు గ్రూప్–1 విజేతలు సాక్ష్యం. ఏళ్లుగా పుస్తకాలతో కుస్తీపట్టిన వారు తమ లక్ష్యాన్ని ముద్దాడారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ గ్రూప్–1 విజేతలుగా నిలిచారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన వారు ఇక సమాజాభివృద్ధిలో తమ పాత్రను పోషించనున్నారు. గ్రూప్–1 విజేతల సక్సెస్ స్టోరీ..

– వివరాలు 10లో▸

క్లుప్తంగా

బార్ అండ్ రెస్టారెంట్‌లో ఒకరి హత్య


శ్రీనివాస్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని నిజామాబాద్‌రోడ్ లోగల స్వప్న బార్ అండ్ రెస్టారెంట్‌లో ఒకరు హత్యకు గురయ్యారు. వెయిటర్ శ్రీనివాస్‌పై వంటమనిషి చరణ్ సింగ్ బీరుసీసాతో దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జగిత్యాలరూరల్ మండలం మోరపల్లికి చెందిన వంగ శ్రీనివాస్ (34)15 రోజులుగా బార్‌అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం వేకువజామున రెస్టారెంట్‌లో వంటమనిషిగా పనిచేస్తున్న నేపాల్‌కు చరణ్ దీప్ సింగ్ తోటి కార్మికులతో వాగ్వివాదానికి దిగాడు. ఆ గొడవను సర్దిచెప్పేందుకు శ్రీనివాస్ ప్రయత్నించగా.. చరణ్‌సింగ్ బీరుసీసాతో దాడిచేశాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి భార్య వంగ సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

రోళ్లవాగు నీటికి అడ్డుకట్ట



సారంగాపూర్:రోళ్లవాగు ప్రాజెక్టుకు గేట్లు బిగించకపోవడంతో నీరు దిగువకు వెళ్లిపోతోంది. ఫలితంగా పంట పొలాలకు నష్టం వాటిల్లుతోంది. నీరు బయటకు వెళ్లకుండా ఎస్సారెస్పీ అధికారులు భారీ వృక్షాలను అడ్డుగా వేసి నిలిపివేశారు. అటవీశాఖ అనుమతి రాకపోవడంతో తూములకు రెండేళ్లుగా గేట్లు బిగించలేదు. దీంతో వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు వెళ్లిపోతోంది. గతేడాది తాత్కాలికంగా రేకులు అడ్డుగా పెట్టారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో నారుమడులు, నాట్ల కోసం ఆ రేకులను కొంతమేర తొలగించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీవర్షాలకు తోడు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ డి–53 ద్వారా రోళ్లవాగులోకి 800 క్యూసెక్కుల చొప్పున నీరు చేరుతోంది. ప్రాజెక్టు నుంచి నీరంతా పొలాల మీదుగా ప్రవహిస్తోంది. ఈ విషయాన్ని రైతులు ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఈఈ చక్రూనాయక్, ఇంజినీరింగ్ అధికారులు చెర్లపల్లి వైపు వెళ్లే తూములో పొక్లెయిన్ సహాయంతో పెద్ద, పెద్ద వృక్షాలను వేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): సీతారాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ వివరాల మేరకు చొప్పదండికి చెందిన కొంకటి సందీప్(24) చొప్పదండి నుంచి కరీంనగర్‌లోని తన కార్యాలయానికి బైక్‌పై వస్తున్నాడు. సీతారాంపూర్‌లో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలై మృతిచెందాడు.

ఘొల్లుమన్న గోపాల్‌రావుపల్లె

- శోకసంద్రమైన ఊరు
- 45 ఏళ్లకు విగతజీవిగా ఇల్లు చేరిన కడారి సత్యనారాయణరెడ్డి
- మావోయిస్టు కొనకు కన్నీటి వీడ్కోలు
- తరలివచ్చిన ప్రజలు, పౌరహక్కుల నేతలు, బాల్యమిత్రులు


గోపాల్‌రావుపల్లెలో సత్యనారాయణరెడ్డి అంతిమయాత్ర

సిరిసిల్ల/తంగళ్లపల్లి(సిరిసిల్ల): గోపాల్‌రావుపల్లె.. పచ్చటి పొలాలు, ఎత్తైన గుట్టలు.. మధ్యమానేరు బ్యాక్ వాటర్.. పాడిపంటలతో కళకళలాడే ఊరు. ఆ ఊరిలో ఉన్నత కుటుంబంలో పుట్టిన నూనూగు మీసాల యువకుడు.. నాలుగున్నర దశాబ్దాల క్రితం పీడిత ప్రజల విముక్తి కోసం ఉద్యమబాట పట్టాడు. ఈ తరం వారికి అతనెవరో తెలియదు. కానీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ అడవుల్లో సోమవారం ఎన్‌కౌంటర్‌లో మరణించిన కొస అలియాస్ కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ సాధు ఉన్నట్లు తెలియడంతో ఒక్కసారిగా గోపాల్‌రావుపల్లె వార్తల్లోకెక్కింది. కొస పార్థీవదేహం గురువారం ఉదయం 10.20 గంటలకు ఆ పల్లెకు చేరగానే ఆ ఊరంతా కన్నీటిసంద్రమైంది. నాలుగున్నర దశాబ్దాలుగా కంటికి, ఇంటికి దూరమైన మావోయిస్టు అగ్రనేత కొస ప్రస్థానం అంత్యక్రియలతో ముగిసింది.

ఎరుపెక్కిన ఊరు

కడారి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ముద్దుగా పిలుచుకునే సత్యం పార్థీవదేహం రావడంతో అప్పటికే ఊరు చేరిన ప్రజాసంఘాల ప్రతినిధులు, పౌరహక్కుల నేతలు, కళాకారులు, మాజీ మావోయిస్టు నేతలు ఎర్రజెండాలు కప్పి నివాళి అర్పించారు. కొస చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. సత్యనారాయణరెడ్డి మృతదేహం గ్రామానికి చేరగానే ప్రజాకళాకారులు పాటలతో కొసను తలచుకుంటూ ఉద్యమ గీతాలు ఆలపించారు. పిడికిళ్లు బిగించి నివాళులు అర్పిస్తూ, జోహార్లు చెబుతూ హోరెత్తించారు. మధ్యాహ్నం అంతిమయాత్ర ప్రారంభం కాగానే ఓ వైపు వర్షం మరోవైపు రోడ్డుపై బురద ఉన్నా.. జనం లెక్క చేయకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, కళాకారుల ఉద్యమ గీతాలు, ఆవేశపూరిత ప్రసంగాలతో అంతిమయాత్ర సాగింది.

తరలివచ్చిన అభిమానులు

సత్యనారాయణరెడ్డి అంతిమయాత్రకు ప్రజాసంఘాల ప్రతినిధులు గాదె ఇన్నయ్య, ఉద్యోగ సంఘాల ప్రతినిధి దేవిప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకులు నక్క నారాయణరావు, మాదన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ వ్యవస్థాపకులు మార్వాడి సుదర్శన్, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధి పద్మకుమారి, ప్రజాసంఘాల ప్రతినిధులు శాంతి, యాదవ్వ, లక్ష్మి, భవాని, మాజీ మావోయిస్టులు జ్యోతి, అమర్, గాజర్ల అశోక్, సిదన్న, దళిత సంఘాల ప్రతినిధులు రాగుల రాములు, రంజిత్, కవులు జూకంటి జగన్నాథం, గాయకులు నాగరాజు, శ్రీకాంత్, అభిమానులు, జిల్లాలోని పలు గ్రామాల ప్రతినిధులు తరలి రావడంతో గోపాల్‌రావుపల్లె జనసంద్రమైంది. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపుతుందని, మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు నాయకులు పాడెమోశారు. వర్షంలోనూ కన్నీటి వీడ్కోలు పలికారు.


కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొస(ఫైల్)


కొస భార్య రాధా అలియాస్ రుక్మిణి(ఫైల్)

కొస భార్య కూడా ఎన్‌కౌంటర్‌లో బలి

సత్యనారాయణరెడ్డి ఇల్లు విడిచి ఉద్యమంలో చేరినప్పుడు అతనికి పెళ్లికాలేదు. నిజానికి పెళ్లి చేసుకుంటే.. విప్లవ ఉద్యమంలో పని చేయడం ఇబ్బందిగా ఉంటుందని భావించి ముందే పిల్లలు కాకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న కమిట్‌మెంట్ ఉద్యమకారుడు. గర్చిరోలి జిల్లా కార్యదర్శిగా ఉండగా ఆదివాసీ మహిళ అయిన చడిమేక్ రుక్మిణి అలియాస్ రాధను పెళ్లి చేసుకున్నాడు. ఉద్యమ సహచరిగా ఉన్న ఆమె బస్తర్ జిల్లా మావోయిస్టు కార్యదర్శి హోదాలో ఏడాది క్రితం ఎన్‌కౌంటర్‌లో మరణించింది. కొస కుటుంబ సభ్యులకు మాత్రం అతనికి ఇంకా పెళ్లి కాలేదని తెలిసినా, ఉద్యమంలో రాధను పెళ్లి చేసుకున్నట్లు మాజీ మావోయిస్టులు వెల్లడించారు.


నివాళి అర్పిస్తున్న జూకంటి జగన్నాథం


నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కృష్ణారెడ్డి తదితరులు


తమ్ముడి చితికి నిప్పుపెడుతున్న కరుణాకర్‌రెడ్డి


కన్నీటి సంద్రంలో కుటుంబ సభ్యులు


మాట్లాడుతున్న పౌరహక్కుల నాయకులు

ఏకపక్ష కాల్పులు సరికాదు



నేను, సత్యనారాయణరెడ్డి పెద్దపల్లిలో ఐటీఐ చేశాం. ఇద్దరం క్లాస్‌మెంట్లమే. ఎంతో చురుకైన విద్యార్థి. నేను ఉద్యోగంలో చేరి స్థిరపడ్డాను. ఆయన ఉద్యమంలో చేరారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని చెబుతున్నా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏకపక్ష కాల్పులకు దిగుతుంది. మావోయిస్టులను అంతం చేయడం కాదు.. నిరుద్యోగాన్ని, పేదరికాన్ని అంతం చేయాలి.

– దేవీప్రసాద్, కొస క్లాస్‌మెంట్

కమిట్‌మెంట్ ఉన్న గొప్ప వ్యక్తి



మాది రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగళపల్లె. నేను మావోయిస్టు పార్టీలో 20 ఏళ్లు పని చేశాను. కొస దాదాతో కలిసి చాలా కాలం పని చేశాను. ఎంతో కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి. ప్రజాఉద్యమాలపై పాఠాలు చెప్పేవారు. వనరుల దోపిడీ, పీడిత ప్రజల మౌలిక వసతులు, బహుళజాతి కంపెనీల ఎత్తుగడలను వివరించేవారు. పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తూ దేశమంతటా తిరిగేవారు. ఆయన పార్టీకి ఓ లెజెండ్.

– నేరెళ్ల జ్యోతి, మాజీ మావోయిస్టు, శివంగాళపల్లె

మా అన్నతో కలిసి ఉద్యమంలోకి..



మాది పెద్దపల్లి పక్కన ఓ పల్లె. మా అన్న లచ్చిరెడ్డి అలియాస్ సూరన్న తొలితరం దళనేత. సూరన్నతో కలిసి సత్యనారాయణరెడ్డి ప్రజా ఉద్యమాల్లోకి వెళ్లాడు. నిజానికి 1980లో తొలిసారి ఆదివాసీ ప్రాంతాల్లో సాయుధ పోరాటాన్ని నడిపించిన మొదటి వ్యక్తి కొస. దండకారణ్యంలో ఆదివాసీ సమస్యలపై పోరాటం చేస్తూ, అక్కడి ప్రజలను ఏకం చేశారు. ఆయన స్ఫూర్తితోనే మావోయిస్టు పార్టీ దండకారణ్యంలో నాలుగున్నర దశాబ్దాలుగా మనుగడ సాధించింది.

– కంది చొక్కారెడ్డి, పెద్దపల్లి

కొలువు కొట్టారు

- శ్రమించారు.. విజయం సాధించారు
- గ్రూప్–1లో ఉద్యోగాలు సాధించిన జిల్లా యువత

లక్ష్యంపై స్పష్టత.. సాధించాలనే తపన.. పట్టుదలకు కృషి తోడైతే విజయం సాధిస్తారనేదానికి గ్రూప్–1 విజేతలే నిదర్శనం. లక్ష్యం పెద్దదైనా.. కాలం పరీక్షలు పెట్టినా తట్టుకొని విజయం సాధించారు. టాలెంట్‌ను ఏదీ అడ్డుకోలేదని నిరూపించారు. తమ కలలు.. తల్లిదండ్రుల ఆశలను సాకారం చేసి విజేతలుగా నిలిచారు. 2024లో గ్రూప్–1 పరీక్ష రాయగా.. గురువారం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు యువతీయువకులు కొలువులు సాధించారు. గ్రూప్–1 ఉద్యోగాలు సాధించిన యువతీయువకుల సక్సెస్ స్టోరీ.

కుటుంబ అండదండలతో..


కుటుంబ సభ్యులతో శివశంకర్‌వరప్రసాద్

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన సింగరేణిలో ఓసీపీ ఈపీ ఆపరేటర్ తుంగపిండి ఆనంద్ కొడుకు తుంగపిండి శివశంకర్‌ప్రసాద్ 448 ర్యాంక్‌తో అసిస్టెంట్ ట్రెజరరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ప్రాథమిక విద్య సింగరేణిప్రాంతంలోనే పూర్తి చేసిన శివశంకర్‌ప్రసాద్ ఇంటర్ కరీంనగర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత రెండేళ్ల పాటు గ్రూప్స్, సివిల్స్ కోసం ప్రయత్నించారు. ఇంతలోనే గ్రూప్–1 నోటిఫికేషన్ రావడంతో ప్రణాళికాబద్ధంగా చదివి ఉద్యోగం సాధించారు. శివశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల అండదండలతోనే ఈ విజయం సాధించానని, గ్రూప్–1 ఉద్యోగం చేస్తూనే సివిల్స్ రాసి ఐఏఎస్ కావడమే తన జీవిత లక్ష్యమన్నారు. తన ఎదుగుదలలో అమ్మానాన్నల పాత్ర అమోఘమని, వారికి రుణపడి ఉంటానన్నారు.

తల్లిదండ్రుల సహకారం


అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎంపికైన సతీశ్‌కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ ఎల్కలపల్లిగేట్‌కు చెందిన సామల శంకరయ్య–సూరమ్మ దంపతుల పెద్దకుమారుడు సామల సతీశ్‌కుమార్ 154వ ర్యాంక్‌తో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సతీశ్‌కుమార్ పాఠశాల విద్యను గోదావరిఖనిలో, ఇంటర్ హన్మకొండ, బీటెక్ అనంతపురంలోని జేఎన్టీయూలో పూర్తి చేశారు. బీటెక్ పూర్తయ్యాక యూపీఎస్సీ కోసం పదేళ్ల పాటు ప్రిపేర్ అయ్యారు. ఈక్రమంలోనే సీఆర్పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్, సెంట్రల్ ఇంటెలిజెన్స్‌బ్యూరోలో ఉద్యోగం సాధించారు. ఖాళీ సమయంలో హైదరాబాద్‌లోని పలు ఇనిస్టిట్యూట్‌లలో విద్యార్థులకు యూపీఎస్సీ, పోటీ పరీక్షలపై శిక్షణ ఇచ్చేవారు. గ్రూప్–1 నోటిఫికేషన్ రావడంతో రాత్రింబవళ్లు కష్టపడి ప్రిపేర్ అయి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కొలువు కొట్టారు.

వ్యవసాయ కుటుంబం నుంచి ఆర్డీవోగా..


తల్లిదండ్రులతో భూషిత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ ప్రాంతానికి చెందిన పొందుగుల భూషిత్‌రెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో ఆర్డీవోగా ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భాస్కర్‌రెడ్డి–విజయలక్ష్మి దంపతుల కుమారుడు భూషిత్‌రెడ్డి. గ్రూప్–1లో 343వ ర్యాంక్‌తో ఆర్డీవోగా ఉద్యోగం సాధించారు. భూషిత్‌రెడ్డి పాఠశాల విద్యాభ్యాసం పెద్దపల్లి, హైదరాబాద్‌లో ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. ప్రస్తుతం బెంగళూరులో ఇన్‌కంటాక్సు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు.

కోచింగ్ ఇస్తూనే ఉద్యోగం సాధించి


అనూష

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మెన్నేని అనూష గ్రూప్–1లో రాష్ట్రస్థాయిలో 62వ ర్యాంక్‌తో జిల్లా పంచాయతీ అధికారిగా ఎంపికయ్యారు. ముస్తాబాద్‌కు చెందిన మెన్నేని జగన్‌మోహన్‌రావు కుమారుడు సంతోష్‌రావు సతీమణి అయిన అనూష బీటెక్ చదివి ఉస్మానియాలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. న్యాయవిద్యలో రెండు బంగారు పతకాలు సాధించిన అనూష.. డీపీవోగా ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో భర్త సంతోష్‌రావుతో కలిసి కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్న అనూష డీపీవోగా ఎంపికయ్యారు.

మొదటి ప్రయత్నంలోనే సక్సెస్


దురిశెట్టి విజయ్‌కుమార్

కోరుట్ల: కష్టపడితే ఫలితం వస్తుందనేందుకు కోరుట్లకు చెందిన దురిశెట్టి విజయ్‌కుమార్ నిదర్శనం. పట్టణానికి చెందిన విజయ్ 177వ ర్యాంక్‌తో జైళ్లశాఖ డీఎస్పీగా ఎంపికయ్యారు. దురిశెట్టి సత్యనారాయణ–జమునారాణి దంపతులకు కూతురు, కుమారుడు. సత్యనారాయణ కోరుట్లలో జ్యూవెల్లరీ షాప్ నిర్వహిస్తుండగా... జమునారాణి గృహిణి. విజయ్‌కుమార్ పదోతరగతి వరకు కోరుట్ల, ఇంటర్ హైదరాబాద్, ఢిల్లీలోని ఎన్ఐటీలో బీటెక్(ఈసీఈ) పూర్తి చేశారు. గతేడాది గ్రూప్–4 పరీక్ష రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై మెట్‌పల్లి ఆర్డీవో ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్–1 ఫలితాల్లో 177వ ర్యాంక్ సాధించి..జైళ్లశాఖ డీఎస్పీగా ఎంపికయ్యారు.

ఎన్టీపీసీ యువకుడు.. గ్రూప్–1 విజేత


శ్రీరాంరెడ్డి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన ముద్దసాని శ్రీరాంరెడ్డి గ్రూప్–1లో 144వ ర్యాంక్‌తో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎంపికయ్యారు. స్థానిక కృష్ణానగర్‌కు చెందిన ముద్దసాని శ్రీనివాసరెడ్డి–ఊర్మిల దంపతుల కుమారుడు ముద్దసాని శ్రీరాంరెడ్డి స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో పాఠశాల విద్య, ఫిట్‌జీలో ఇంటర్ చదివారు. తాను పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి యూపీఎస్సీకి సిద్ధమవుతున్నారు. రెండోసారి యూపీఎస్‌ఈ మెయిన్స్ వరకు వెళ్లారు. ఈక్రమంలో గ్రూప్–1 ఫలితాలు వెలువడడంతో ఉద్యోగం సాధించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



జగిత్యాలరూరల్: రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, ఈజీఎస్ నిధులు జగిత్యాలకు మంజూరయ్యాయని తెలిపారు. యూరియా కొరతతకు అనేక కారణాలున్నాయని, కేంద్రాన్ని విమర్శించి రాజకీయం చేయడం అవసరం లేదన్నారు. పంచాయతీరాజ్ ఈఈ లక్ష్మణ్‌రావు, ఎంపీడీవో రమాదేవి, డీఈ మిలింద్, ఎంపీవో రవిబాబు, ఎంఈవో గంగాధర్ పాల్గొన్నారు. అంతకుముందు పొలాసలోని పొలాస్తేశ్వరస్వామి ఆలయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. యాదవ యువజన సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత యాదవ మహాసంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

కొత్త బస్టాండ్ వద్ద ట్రాఫిక్ తిప్పలు



జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్దార్ వల్లభాయ్‌పటేల్ చౌరస్తాలో గురువారం భారీ వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంలో ఆర్టీసీ బస్సు వెళ్తుండగా.. ఇతర వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది కలగడంతో.. వెంటనే ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వివాహిత మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: ఇద్దరు పిల్లలున్న వివాహితను లైంగికంగా వేధించడమే కాకుండా ఆమె మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆనంద్ కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమెకు కొండికర్లకు చెందిన ఎండీ.రహీమ్ ఫోన్ చేసి లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. భరించలేక విషయాన్ని కుటుంబసభ్యులకు వివరించింది. 2018 ఫిబ్రవరి ఒకటిన మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై శంకర్‌రావు కేసు నమోదు చేసి ఎండీ.రహీంను అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు నమోదైనా నిందితుడిలో మార్పు రాలేదు. తిరిగి సదరు వివాహితను వేధించడంతో 2018 మార్చి 25న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శంకర్‌రావు కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ రెండు కేసుల్లోనూ కోర్టు మానిటరింగ్ అధికారి పి.వినోద్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితుడైన రహీంకు రెండు కేసుల్లో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.నాలుగువేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

హుండీల దొంగ అరెస్ట్

ధర్మారం(ధర్మపురి): ఆలయాల్లో హుండీల చోరీకి పాల్పడిన ధర్మారం మండలం సాయంపేట గ్రామానికి చెందిన కూకట్ల సదానందంను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సదానందం ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని పలు ఆలయాల్లో హుండీలను పగులకొట్టి చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. గురువారం ధర్మారం మార్కెట్ యార్డు సమీపంలో సదానందంను పట్టుకుని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

కనిపించని 'మార్పు'

- తూతూమంత్రంగా వంద రోజుల ప్రణాళిక
- పకడ్బందీగా అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- సమస్యలు పరిష్కారం కాక ప్రజలకు తప్పని ఇబ్బందులు



గుంతలతో ఉన్న ఈ రోడ్డు స్థానిక సిద్ధి వినాయకనగర్‌లోనిది. ఇలా గుంతలమయై ఉన్న రహదారులు పట్టణంలో చాలా వీధుల్లో ఉన్నాయి. వంద రోజుల ప్రణాళికలో ఇలాంటి గుంతలకు మరమ్మతు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. స్థానిక అధికారులు ఆ పని చేయకపోవడంతో పలు కాలనీల్లో ప్రజలు ఆయా రోడ్లపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తున్న ఈ డ్రైనేజీ మెట్‌పల్లి బల్దియాలోని 12 వార్డులోనిది. పట్టణంలో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ దృశ్యం నిదర్శనంగా నిలుస్తోంది. కొన్ని నెలలుగా వ్యర్థాలు డ్రైనేజీలో పూడుకపోయినప్పటికీ వాటిని తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇలా ఈ ఒక్క చోటే కాదు.. చాలా వీధుల్లో డ్రైనేజీల పరిస్థితి ఇలాగే ఉంది. ఇటీవల ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఇలాంటి వాటిని గుర్తించి శుభ్రం చేయాలి. అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

మెట్‌పల్లి: మున్సిపాలిటీలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాటిగా తీర్చిదిద్దడమే కాకుండా ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగించడం కోసం ప్రభుత్వం ఇటీవల వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ప్రతి రోజు 'ఒక చర్య.. ఒక మార్పు' అనే నినాదంతో దీనికి శ్రీకారం చుట్టింది. ఎంతో మంచి ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని మెట్‌పల్లి పట్టణంలో అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిని పకడ్బందీగా అమలు చేసి ఉంటే పలు సమస్యలు పరిష్కారానికి నోచుకునేవి. కానీ అధికారులు అలా చేయకపోవడం వల్ల ఎటువంటి 'మార్పు' లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రణాళికలో 50 అంశాలు..

- మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళికను జూన్ 2న ప్రారంభించి, ఈనెల 10న ముగించింది.
- ఇందులో సుమారు 50 అంశాలను పొందుపర్చింది. వీటిని పకడ్బందీగా అమలు చేయడం కోసం మున్సిపల్ సిబ్బందే కాకుండా వివిధ వర్గాలను భాగస్వాములుగా చేయాలని సూచించింది.
- ప్రధానంగా ప్రజావసరాలైనా డ్రైనేజీలు, నాలాల్లో పూడిక తొలగించడం..అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తీసివేయడం, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయడం, రోడ్లపై గుంతలను పూడ్చడం, పబ్లిక్ టాయిలెట్ల సమస్యలు పరిష్కరించడం, దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం, మంచినీటి వనరులను శుద్ధి చేయడం వంటివి ఉన్నాయి.

చిత్తశుద్ధి చూపని అధికారులు

- వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఏయే పనులు చేపట్టాలన్నది ఉన్నతాధికారులు నిర్దేశించారు.
- మెట్‌పల్లి పట్టణంలో అధికారులు వీటిని సక్రమంగా అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలున్నాయి. దీనివల్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చాలా కాలనీల్లో రోడ్లపై గుంతలను పూడ్చకుండా, డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించకుండా అలాగే వదిలేశారు. ఖాళీ ప్రదేశాల్లో, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించలేదు.
- వీటితో పాటు పలుచోట్ల మూతబడ్డ పబ్లిక్ టాయిలెట్లను పునరుద్ధరించలేదు.
- ఇలా అనేక సమస్యలపై దృష్టి సారించకుండా నామమాత్రంగా చేపట్టి.. ముగించారు.
- స్థానికంగా సమస్యలు ఎక్కువగా ఉన్న శివారు కాలనీలకు చాలాకాలంగా అధికారులు రావడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ప్రస్తుతం కౌన్సిలర్లు లేకపోవడం..మరోవైపు అధికారులు రాకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆయా కాలనీలవాసులు నానా అవస్థలు పడుతున్నారు.
- వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంతోనైనా తమ కాలనీల్లో సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన వారికి అధికారుల తీరుతో నిరాశే మిగలడం గమనార్హం.